క్లుప్తంగా

ఒబెసిటీపై అప్రమత్తంగా ఉండాలి



గుంటూరు మెడికల్: షుగర్ వ్యాధి బాధితులు అధిక బరువుపై(ఒబెసిటీ) అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ అన్నారు. వరల్డ్ ఒబెసిటీ డే సందర్భంగా మంగళవారం స్థానిక కొత్తపేటలోని ఎస్.వి.ఆర్.షుగర్ హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డాక్టర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ ఊబకాయం కేవలం సౌందర్య సమస్య మాత్రమే కాదని, అనేక అనారోగ్యాలకు కారణమని పేర్కొన్నారు. అధిక బరువుతో షుగర్ వ్యాధి బాధితులు, ఇతర అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. అధిక బరువు ఉన్నవారు కనీసం ఐదు నుంచి పది శాతం బరువు తగ్గడం వల్ల రక్తపోటు తగ్గుతోందన్నారు. టైప్-2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గించుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కమల రామ్ కుమార్ పాల్గొన్నారు.

గుంటూరులో కాక్లియర్ లైవ్ సర్జరీలు



గుంటూరు మెడికల్: పుట్టుకతోనే వినికిడి సమస్యలను తొలగించేందుకు కాక్లియర్ సర్జరీలు ఎంతో ఉపయోగపడతాయని ప్రముఖ కాక్లియర్ ఇంప్లాంట్ సర్జన్ డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు అన్నారు. గుంటూరులోని డాక్టర్ రాధిక అండ్ రాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు లైవ్ వర్క్‌షాపు రెండు రోజులపాటు నిర్వహించారు. లైవ్ వర్క్‌షాపులో వినికిడి లోపం ఉన్న ముగ్గురు చిన్నారులకు వినికిడి ప్రసాదించే కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు ప్రత్యక్షంగా చేసి చూపించారు. శస్త్ర చికిత్స విధానాలను అందరికీ అర్థమయ్యే రీతిలో డాక్టర్ సుబ్బారాయుడు, కోయంబత్తూర్‌కు చెందిన డాక్టర్ ఆనంద్ రాజు చేసి చూపించారు. కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలో అత్యంత అత్యుత్తమ ప్రతిభ ఉన్న డాక్టర్ జేఎం హంస, డాక్టర్ మోహన్ కామేశ్వర్, డాక్టర్ మిలింద్ వి కీర్తనే ఆధునిక శస్త్ర చికిత్స పద్ధతులు గురించి వివరించారు. సుమారు 80 మంది ప్రత్యక్షంగానూ 500 పైగా ప్రత్యక్ష ప్రసారాల వీక్షణ ద్వారా ఈ వర్క్‌షాపును వీక్షించినట్లు డాక్టర్ సుబ్బా రాయుడు చెప్పారు.

క్యాన్సర్ నుంచి రక్షణకు వ్యాక్సిన్



గుంటూరు మెడికల్: గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ రాకుండా ముందస్తుగా వ్యాక్సిన్ అందుబాటులో ఉందని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అహల్య హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ సంతాన సాఫల్య నిపుణురాలు డాక్టర్ శనక్కాయల రాజకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని ప్రభుత్వ మహిళ కళాశాలలో గైనకాలజిస్టుల సంఘం (పాగ్సి) ఆధ్వర్యంలో సంపూర్ణ కార్యక్రమంపై సదస్సు నిర్వహించారు. సదస్సులో డాక్టర్ ప్రభావతి, డాక్టర్ అపర్ణ, డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ యువత ముందస్తుగా వ్యాక్సిన్ చేయించుకుంటే భవిష్యత్‌లో క్యాన్సర్ రాకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. క్యాన్సర్ సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, రుతుక్రమం సమయంలో ఎలాంటి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలనే విషయాల గురించి విద్యార్థులకు వివరించారు.

ముఠా కార్మికులకు కూలీ రేట్లు 13 శాతం పెంపు

లక్ష్మీపురం: నగరంలోని కిరాణా షాపుల్లో పని చేస్తున్న ముఠా కార్మికులకు 13 శాతం కూలీ రేట్లు పెంపుదల అయినట్లు ఏఐటీయూసీ హమాలీ(ముఠా) ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్న ఆంజనేయులు తెలిపారు. స్థానిక నగర ముఠా కార్మిక సంఘం, రేగుల రాఘవయ్య భవనంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఠా కార్మికులు 50 కేజీలకు మించి బరువు మోయకూడదని అంతర్జాతీయ కార్మిక సమైక్య ఐఎల్ఓ తీర్మానాన్ని అమలు చేయడంలో యజమాన్యం నిర్లక్ష్య వైఖరి అవలంబించడం సరికాదన్నారు. ఈ అగ్రిమెంటు మార్చి 3న కిరాణా యాజమాన్యం, ఏఐటీయూసీ యూనియన్ ఒప్పందం ప్రకారం రెండు సంవత్సరాల పాటు అమలులో ఉంటుందని చెప్పారు. నగర ముఠా కార్మిక సంఘం అధ్యక్షుడు జి.సురేష్ బాబు మాట్లాడుతూ నగర ముఠా కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కిరాణా కార్మికుల కూలీ పెంపుదల చేయటం హర్షణీయమని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు, కిరాణా ముఠా కార్మిక సంఘం నాయకులు కొండా వెంకటేశ్వర రెడ్డి, ఆదిబాబు, పప్పు రోశి రెడ్డి, కొంగలి కోటయ్య పాల్గొన్నారు.

వీడలేమంటూ... వీడుకోలంటూ

ఫేర్‌వెల్.. ఫరెవర్

- జీవితంలో మరపురాని పాఠశాల విద్య
- 13 ఏళ్ల పాఠశాల విద్యార్థి దశకు చివరి మజిలీ
- జీవితాంతం గుర్తుండిపోయే స్నేహితులకు పునాది ఇక్కడే
- జ్ఞాపకాలను కలకాలం భద్ర పరచుకునేందుకు వినూత్నమైన కార్యక్రమాలు
- స్లామ్ బుక్, విద్యార్థుల చేతి ముద్రలను భద్రపర్చడంతో జ్ఞాపకాలు పదిలం
- సీబీఎస్ఈ, స్టేట్ పబ్లిక్ పరీక్షల దృష్ట్యా పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు ఫేర్‌వెల్ కార్యక్రమాల నిర్వహణ



గుంటూరులోని ఓ పాఠశాలలో టెన్త్ ఫేర్‌వెల్‌డేలో భాగంగా హ్యాండ్ ప్రింట్స్ వేస్తున్న విద్యార్థులు



డ్యాన్స్‌తో హోరెత్తిస్తున్న తొమ్మిదో తరగతి విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: పరీక్షా కాలం.. జీవితంలో మరపురాని జ్ఞాపకాలకు పాఠశాల పునాది వంటిది. నర్సరీ మొదలు పదో తరగతి వరకు 13 ఏళ్ల పాటు పాఠశాలలో గడిపిన రోజులు.. సహచరులతో గడిపిన మధుర క్షణాలను భద్రంగా దాచుకునేందుకు ఫొటోలు ఎంతగానో దోహదం చేస్తాయి. ఎందుకంటే పాఠశాలలో గడిపిన రోజుల్లో స్వచ్ఛమైన స్నేహం చిగురిస్తుంది. పాఠశాలను వీడి వెళ్లినా, జీవితాంతం గుర్తుంచుకోదగిన జ్ఞాపకాలను మనకు అందిస్తుంది. ఊహ తెలియని చిరుప్రాయం మొదలు బాధ్యతగా వ్యవహరించాల్సిన యుక్త వయసు వరకు ఎన్నెన్నో జ్ఞాపకాలు ఉండగా, వాటిని భద్రపరచుకునేందుకు కాలానుగుణంగా అనేక వినూత్నమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుతం సీబీఎస్ఈ టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరుగుతుండగా, ఈనెల 17 నుంచి ఎస్సెస్సీ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. దీంతో గుంటూరు నగరంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ ఫేర్‌వెల్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

జీవితాంతం గుర్తుండి పోయే రోజులు

పాఠశాలను విడిచివెళ్లే ముందు స్లామ్ బుక్ విధానం ఎప్పటి నుంచో అవలంబిస్తున్నారు. పుస్తకంలో స్నేహితుల సంతకాలు తీసుకుని, వాటిని జీవితాంతం భద్రపరచుకోవడం ఇందులోని ముఖ్యమైన ప్రక్రియ. కాలక్రమేణా వచ్చిన మార్పులతో గ్రూప్ ఫొటో కల్చర్‌తో పాటు సెల్ఫీ రోజులొచ్చాయి. దీంతో పాటు ఫేర్‌వెల్ సందర్భంగా తెల్లటి కాగితాలపై వివిధ రంగుల్లో విద్యార్థుల చేతులను ముంచి, వాటిని ముద్రించడం అనే హ్యాండ్ ప్రింట్ విధానాన్ని అనుసరిస్తున్నారు. వివిధ రకాల రంగుల్లో విద్యార్థుల చేతులను ముంచి, ముద్రించిన హ్యాండ్ ప్రింట్‌పై సంబంధిత విద్యార్థి సంతకం తీసుకుని, వాటిని బ్యాచ్ వారీగా పాఠశాలలో భద్రపరుస్తున్నారు. అదే విధంగా పదో తరగతి బ్యాచ్ పేరుతో చెట్టు ఆకృతిలో కొమ్మలు, ఆకులను గీసి ఒక్కో ఆకు దగ్గర విద్యార్థుల సంతకాలను సేకరించి, ఫ్రెండ్‌షిప్ ట్రీ పేరుతో భద్రపరుస్తున్నారు.

డ్యాన్స్‌లతో సందడి

టెన్త్ ఫేర్‌వెల్ కార్యక్రమాల్లో భాగంగా సీనియర్లకు వీడ్కోలు పలుకుతూ 9వ తరగతి విద్యార్థులు డ్యాన్స్‌లతో హోరెత్తిస్తున్నారు. టెన్త్ ఫేర్‌వెల్ కార్యక్రమాలను తొమ్మిదో తరగతి విద్యార్థులే స్వయంగా నిర్వహిస్తూ, స్టేజ్ ఫియర్, బృంద నాయకత్వ లక్షణాలను అలవర్చుకుంటున్నారు. తద్వారా ఈవెంట్‌ను నిర్వహించగల సామర్థ్యాలను పెంపొందించుకుంటున్నారు.

వైభవంగా శ్రీప్రసన్నాంజనేయ స్వామి కల్యాణ మహోత్సవం



నగరంపాలెం: స్థానిక మారుతీనగర్‌లోని శ్రీకంచి కామకోటి పీఠ శ్రీమారుతి దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు మూడో రోజుకి చేరాయి. మంగళవారం బాలపూజ యాగశాలలో జపములు శ్రీసుబ్రహ్మణ్యస్వామి హోమం హనుమద్ రుద్రయాగం యథావిధిగా జరిగాయి. సామూహిక లలితా సహస్రనామ సహిత కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం శ్రీప్రసన్నాంజనేయ స్వామి వార్ల నగరోత్సవం వైభవంగా జరిగింది. శ్రీసురక్షరాజ సమేత ప్రసన్నాంజనేయస్వామి సామూహిక శాంతి కల్యాణ మహోత్సవం చేపట్టగా, సాయంత్రం ఆంజనేయస్వామికి లక్ష నాగవల్లి దళార్చన నిర్వహించారు. బ్రహ్మశ్రీ ముప్పవరపు సింహాచలశాస్త్రి భాగవతార్ శ్రీరామ కరుణా మృతం హరికథ సభికులను అలరించింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించగా, కార్యదర్శి తంగిరాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేగంగా శంకరవిలాస్ ఆర్‌ఓబీ నిర్మాణ విస్తరణ పనులు



పనులు పరిశీలిస్తున్న అధికారులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో పెరిగిన ట్రాఫిక్ నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నగరంలోని శంకర్ విలాస్ ఆర్‌ఓబీ నిర్మించేందుకు ఇప్పటికే అనుమతులు మంజూరయ్యాయని, నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా నగర పాలక సంస్థ తరఫున చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ పనులు వేగంగా చేపడుతున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారుల ఆధ్వర్యంలో హిందూ కాలేజి నుంచి ఏసీ కాలేజి వరకు ఏఈఎల్సీ, ప్రభుత్వ భవనాలు, అరండల్ పేట 2వ లైన్ నుంచి 10వ లైన్ వరకు ప్రైవేట్ భవనాలు తొలగించారు. శంకర్ విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణ పనుల కోసం చేపట్టిన రోడ్డు విస్తరణ పనులలో భాగంగా మొత్తం 134 ఆస్తులలో బ్రాడీపేట, అరండల్ పేటలకు సంబంధించిన 99 భవన యజమానులకు నోటీసులు ఇవ్వడం జరిగిందని చెప్పారు. 14 ప్రభుత్వ భవనాలు, 21 మిషనరీ ఆస్తులకు రోడ్డు విస్తరణకు గాను నోటీసులు అందజేశామని తెలిపారు. పలువురు ప్రైవేట్ భవన యజమానులు, ఏఈఎల్సీ ప్రతినిధులు స్వచ్ఛందంగా రోడ్డు విస్తరణకు ముందుకు వచ్చి అంగీకార పత్రాలను నగర పాలక సంస్థకు అందజేశారన్నారు. రోడ్డు విస్తరణ క్రమంలో భవనాల తొలగింపు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. విస్తరణలో మార్కింగ్ ప్రకారం వారి ఆస్తి విలువను బట్టి భవన యజమానులకు కోల్పోయిన భవనాలకు నష్టపరిహారం, స్థలం విలువకు 4 రెట్లు విలువైన టీడీఆర్ బాండ్లను అందిస్తామని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు.

మంత్రి అచ్చెన్నాయుడు దిగజారుడు వ్యాఖ్యలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు ఆయన రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖరరావు, ఎం.కళాధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ఫలితాల వెల్లడి సమయంలో యూటీఎఫ్ అభ్యర్థికి రాజకీయ పార్టీ ముసుగు వేస్తూ మాట్లాడటం తగదని, ఏ పార్టీ అధికారంలో ఉన్నా సమస్యలపై యూటీఎఫ్ పోరాటం చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వంలోనూ తాము జీవో 117 రద్దు, సీపీఎస్, పీఆర్సీలపై ఇతర సంఘాలను కలుపుకుని పోరాటాలు చేశామని తెలిపారు.

సెప్టిక్ ట్యాంకర్ల వ్యర్థాలను రోడ్లపై వేస్తే కఠిన చర్యలు



అధికారులకు తగు సూచనలు చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని సెప్టిక్ ట్యాంకర్లు తప్పనిసరిగా ఫీకల్ స్లెడ్జిని నగరపాలక సంస్థ ఫీకల్ సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌లోనే అన్‌లోడ్ చేయాలని, రోడ్ల పక్కన, డ్రెయిన్లలో వేస్తే భారీ అపరాధ రుసుం విధిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం కమిషనర్ సుద్దపల్లి డొంక రోడ్‌లోని నగరపాలక సంస్థ ఎఫ్ఎస్టీపీని ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఎఫ్ఎస్టీపీ సామర్థ్యం, ప్రతి రోజు వస్తున్న ట్రిప్పుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో మల వ్యర్థాలను రోడ్ల పక్కన, డ్రెయిన్లలో వేయడం వలన ప్రజారోగ్యానికి ప్రమాదమని, అందుకు పరిష్కారంగా ఎఫ్ఎస్టీపీని నిర్మాణం చేశామన్నారు. సెప్టిక్ ట్యాంకర్ల యజమానులు తప్పనిసరిగా ఇళ్లల్లోని సెప్టిక్ ట్యాంక్‌ల నుంచి తోడిన వ్యర్థాలను నగరపాలక సంస్థ ఎఫ్ఎస్టీపీకే తీసు కొచ్చి ట్రీట్మెంట్ జరిగేలా సహకరించాలన్నారు. పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ నాగభూషణం, ఏఈ రవి కిరణ్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

10 లోగా మొండి బకాయిలు చెల్లించాలి

నెహ్రూ నగర్: నగర పాలక సంస్థకు దీర్ఘకాలికంగా, మొండి బకాయిలున్న ఆస్తి పన్ను యజమానులకు పన్ను చెల్లింపునకు ఈ నెల 10 వరకు మాత్రమే ఆఖరి గడువు ఇచ్చినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం కమిషనర్ తన చాంబర్‌లో రెవెన్యూ వసూలుపై సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ బకాయిదారులు ఆస్తి పన్ను బకాయిలను, ప్రస్తుత సంవత్సరపు పన్నును వెంటనే చెల్లించాలని, లేకుంటే 11వ తేదీ నుంచి బకాయిదారుల ఆస్తులను సీజ్ చేయనున్నట్లు హెచ్చరించారు. మార్చి నెలలో సెలవు రోజుల్లో కూడా క్యాష్ కౌంటర్లు యథావిధిగా పని చేస్తాయని, పన్నులను జీఎంసీ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటు ఆన్ లైన్ ద్వారా సీడీఎంఏ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో చెక్కులు, డీడీల ద్వారా చెల్లించవచ్చన్నారు. మార్చి నెలలో ఆస్తి పన్ను పై వడ్డీ మాఫీ కోసం వేచి చూడకుండా పన్ను బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సి.హెచ్ శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, ఆర్ఓలు మదన్ గోపాల్, రవికిరణ్ రెడ్డి, సాదిక్ బాషా, రెహమాన్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి



లక్ష్మీపురం: ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఆటో కార్మికునికి రూ.15 వేలు ఇవ్వాలని ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంగ శ్రీనివాసరావు, ఆకిటి అరుణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మంగళవారం గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రవాణా వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న ఆటో కార్మికులు ప్రభుత్వానికి ఆదాయ వనరులుగా మాత్రమే కనబడుతున్నారని చెప్పారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేయడం సరైన పద్ధతి కాదని ఆరోపించారు. ఆటో కార్మికుల సంరక్షణ కొరకు ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఆటో కార్మికుల వద్ద నుంచి అక్రమంగా వసూలు చేస్తున్న ఈ-చలానాలకు సంబంధించిన జీఓ నంబర్ 21, 31 లను తక్షణమే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు కూరాకుల రామ్‌ప్రసాద్, పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర రావు, శ్రీనివాసు, బాబు రావు, శివ, యూసఫ్ పాల్గొన్నారు.

ఉప్పొంగిన ఉత్సాహం



మాట్లాడుతున్న ఏపీ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరసింహం

గుంటూరు వైద్య కళాశాల గ్రాడ్యుయేషన్ డే మంగళవారం ఘనంగా నిర్వహించారు. జింకానా ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్య కళాశాల 2019 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులకు డీఎంఈ నరసింహం డిగ్రీ పట్టాలు అందజేశారు. విద్యార్థులు, తల్లీ దండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారిని సన్మానిస్తున్న దృశ్యం



విద్యార్థినికి వైద్య పట్టా అందజేస్తున్న ఏపీ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరసింహం



వైద్య పట్టా అందుకున్న ఆనందంలో విద్యార్థులు

ఎక్స్‌పోలతో పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య అవగాహన



ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న అంజుల్ జైన్, ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ

గుంటూరు ఎడ్యుకేషన్: క్షేత్రస్థాయిలో ప్రదర్శనల నిర్వహణతో పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సత్సంబంధాలు ఉంటాయని గుజరాత్‌కు చెందిన మెరి లైఫ్ సైన్సెస్ సంస్థ బిజినెస్ హెడ్ అంజుల్ జైన్ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో మంగళవారం స్ఫూర్తి ది ఐక్యూబ్ ఎక్స్‌పో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అంజుల్ జైన్ మాట్లాడుతూ ప్రదర్శనలో భాగంగా అగ్రికల్చర్ మార్కెటింగ్, ఈ-కామర్స్, స్టాక్ మార్కెట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్, టూరిజం, ట్రావెల్, బ్యాంకింగ్ అండ్ ఇన్సూరెన్స్, ఆర్గాన్ డొనేషన్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, వైద్యారోగ్య రంగంలో సాంకేతికత తదితర రంగాలకు సంబంధించిన స్టాల్స్‌ను పరిశీలించారు. పరిశ్రమలు, ఆస్పత్రుల్లో జరుగుతున్న ఆధునిక పరిణామాలు, కొత్త సాంకేతికతల గురించి అవగాహన కలుగుతుందని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ ఇటువంటి ప్రదర్శలు విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపర్చేందుకు, పరిశ్రమల అవసరాలను అర్థం చేసుకునేందుకు మేలైన వేదికగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంబీఏ, ఎంసీఏ విభాగాధిపతులు డాక్టర్ వి.చక్రవర్తి, డి.రాజ్యలక్ష్మి, కన్వీనర్ డాక్టర్ కె.లలిత, కో-కన్వీనర్ బాజీబాబు, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ కల్యాణి, సహాయాచార్యులు వైష్ణవి, వేదవతి, అభిలాష్, అనిత, రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

వైభవంగా హనుమత్ వాహనంపై శ్రీవారి నగరోత్సవం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మహాకుంభాభిషేక మహోత్సవాలు నాలుగో రోజుకి చేరాయి. మంగళవారం హనుమత్ వాహన సేవపై శ్రీవారి నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. హనుమత్ వాహనంపై ఉభయదేవి సమేతుడైన స్వామిని కనుల పండువగా కొనసాగింది. విద్యుత్ దీపకాంతుల నడుమ ప్రధాన వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. టి.టి.డి.ఆగమశాస్త్ర పండితులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు, అగ్ని హోత్ర శోభనాచల లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో కుంభారాధన, నవగ్రహ, మహా సుదర్శన హోమాలు నిర్వహించారు. ఉత్తరకాశి సూర్య భాస్కరేంద్ర సరస్వతిస్వామి ప్రాధాన్యాన్ని వివరించారు. సాహితీవేత్త కె.వి.కోటేశ్వరరావు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, వ్యాపారవేత్తలు గోరంట్ల పున్నయ్యచౌదరి, కొరప్రాటి రామారావు మాట్లాడారు.

NOTICE

IN THE COURT OF THE I ADDL.CIVIL JUDGE(SENIOR DIVISION):: GUNTUR

I.P No: 39 / 2023

BETWEEN :

Patan Fayaz Khan. ...Petitioner

And

Shaik Peer Basha & Others. ...Respondents

To,

R-17:Patan Faheem, S/o. Rehaman, R/o. 5th line, Anandhpet, Guntur.

[illegible]

కారంశి లక్ష్మీ నారాయణ, యం. నాగేంద్రబాబు,

[illegible]

ప్రపంచాన్ని మార్చగలిగే శక్తి మహిళలదే



డాక్టర్ షమా సుల్తానాను సన్మానిస్తున్న దృశ్యం

గుంటూరు మెడికల్: ప్రపంచాన్ని మార్చగలిగే శక్తి కలిగిన మహిళల గౌరవాన్ని కాపాడుతూ ప్రతి ఏడాది మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు హోప్‌విన్ హాస్పిటల్స్ అధినేత, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని గుంటూరు ఫెడరేషన్ ఆఫ్ ఆబ్‌స్టెట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా, హోప్ విన్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో మలినేని పెరుమాళ్ల మహిళ ఫార్మసీ కళాశాలలో సంపూర్ణ శక్తి అనే కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డాక్టర్ షమా సుల్తానా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని, వారు సాధించలేనిదంటూ ఏమీ లేదన్నారు. కుటుంబ సంరక్షణ ప్రధాన ధ్యేయంగా భావించి నిరంతరం విరామం లేని పనులు చేస్తూ తమ ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయడం వలన వివిధ రోగాల బారిన పడుతున్నారన్నారు. మహిళ బాగుంటేనే కుటుంబం బాగుంటుందనే విషయాన్ని గుర్తెరిగి ప్రతి మహిళ తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలని కోరారు. కార్యక్రమంలో ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపాల్ సుధాకర్, టీచింగ్ స్టాఫ్ రాజేష్, సౌజన్య పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం సంచుల వినియోగం



నూలు సంచులను ప్రదర్శిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది, విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా నూలు సంచులపై అవగాహన కల్పించేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో నిర్వహించిన స్ఫూర్తి ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన స్టాల్ సందర్శకులను ఆకట్టుకుంది. ఈసందర్భంగా స్టాల్‌ను శ్రేష్ఠ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి. నాగార్జున, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ సందర్శించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లకు ప్రత్యామ్నాయంగా నూలుతో తయారు చేసిన సంచులను వాడాలని రెడ్‌క్రాస్ మేనేజర్ బుసిరెడ్డి పిచ్చిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కో-ఆర్డినేటర్ కృష్ణప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.